# తలపుల మలుపుల్లో....

నారాయణరావు ఆఫీసు విడిచేసరికి మునిమాపు వేళైంది. ఎంత మహా పట్నంలో, ఎంత మంది ఆప్తుల మధ్య వున్నా, ఎంతసందడిలో వున్నా దిగులుగా వుండే సమయమిది. రుక్మిణి ఏం చేస్తుంటుందో అనుకున్నాడు. రిక్షా త్వరగానే పోతోంది. కానీ తన మనస్సే దానిని దాటి, ఒక గజం, రెండు గజాలు, ఒక ఫర్లాంగు ముందుకు పరుగెడుతోంది. పూర్తిగా యింటికి చేరినట్లు ఊహించుకోవడం, దాన్ని ఊహలోనైనా అనుభవించడం అతనికిష్టంలేదు. ఇల్లాగే రుక్మిణితో కలిసివున్నప్పుడు ఆఫీసు, అక్కడ పని, మెదడుకి పని చెప్పి టెంపోలో పని చేసే సంఘటనలు, మనస్సు చివుక్కుమనే సందర్భాలు వూహించుకోవడం కూడా అతనికిష్టం లేదు. కావాలంటే రెండు వూహలూ చేయగలడు. కానీ చేయడు. చేసుకోడు. వాకిట్లోని సన్నజాజి పూలు రెండు త్రుంపుకుని వాసన చూస్తూ, తలుపు కొట్టాడు. తలుపులు తెరుచుకున్నాయి. పది మాట్లు చెప్పాడు రుక్మిణికి. ఆ ముదురు నీలం రంగు జరీ చీర సాయంత్రం పూట కట్టుకోవద్దని. 'నల్లగా, మబ్బు పట్టిన ఆకాశం, ఆకాశం చివర్ల మెరిసే మెరుపులు జ్ఞాపకం వస్తాయి. దిగులుగా అనిపిస్తుంది' అని కానీ వినదు.

తలుపులు తీసిన రుక్మిణి నవ్వలేదు. లోపలికి వెళ్ళి, తువ్వాలు తెచ్చి, తలుపు కర్టెను యెడంగా పుచ్చుకుంది.

"పదండి స్నానం చేదురు గానీ. వేరే పంచె యిస్తాను" అన్నది.

"కాఫీ త్రాగి..."

"అల్లా కాదు.. మీ మహాలక్ష్మి పిన్నిగారి సత్యం పోయాడని కార్డు వచ్చింది."

నారాయణరావు నిర్ఘాత పోయాడు.

"సత్యమా? సత్యం..! ఏదీ కార్డు?! ప్చ్! పాపం. నిండా పాతికేళ్ళయినా లేవు. ఏం జబ్బో... మొన్నీ మధ్యనే ఉద్యోగంలో చేరాడని అమ్మ రాసింది." కార్డు చదివి స్నానానికెళ్ళాడు నారాయణరావు. ఎప్పుడో చూశాడు అతను సత్యాన్ని. దగ్గరి బంధువులే ఐనా, ఎక్కువ రాకపోకలు లేవు వాళ్ళకీ, తమకూ. పాపం సత్యం!

"మహాలక్ష్మమ్మగారికి పెద్ద తనంలో ఎంతకష్టం వచ్చిందీ! అన్నట్లు సత్యానికి పెళ్ళయింది కదూ?" అన్నాడతను కాఫీ గ్లాసు తీసుకుంటూ...

రుక్మిణి అతని తల తుడుస్తోంది. "పెళ్ళికి ఆ క్రిందటి వేసవిలో మీరు గుంటూరు వెళ్ళారు. పాపం, కష్టమంతా ఆ పిల్లది. జీవితమంతా ఎల్లాగో! నిజానికి ఆడదానికి భర్త తోడిదే సౌఖ్యం. నూరేళ్ళ జీవితం యిప్పుడే తెల్లారింది" అన్నదామె.

నారాయణరావు తువ్వాలు తీసుకు వెళ్ళి దణ్ణెం మీద ఆరేసి వచ్చాడు.

"ఇంత చిన్నతనంలో భర్త పోతే, ఆ పిల్ల బ్రతుకంతా అధ్వాన్నమే గాదుటండీ! మగమహారాజులైతే..."

"మగవాళ్ళకి మాత్రం లేదంటావా కష్టం భార్య పోతే?" అన్నాడతను.

"ఏం కష్టమండీ? ఏడాది తిరిగేసరికి క్రొత్త పెళ్ళికొడుకుల్లాగా తయరవుతారు"

నారాయణరావుకి బాగుండలేదు యీ మాటలు. "ఏమీ కాదు. స్త్రీలకి లోకం సానుభూతి ఎక్కువగా వుంటుంది. 'అయ్యో ఆమె పసుపు, కుంకుమ' అని అంతా కన్నీళ్ళు కారుస్తారు. ఓదారుస్తారు. ఆ ఓదార్పువల్లనే ద్విగుణీకృతమౌతుంది వితంతువు దు:ఖం. మగవాడి కంటావా? ఎంత బాధైనా అగ్ని పర్వతంలా లోపల్లోపల యిముడ్చుకోవలసిందే!" నారాయణరావు గ్రుక్క తిప్పుకునే నిమిత్తం సిగరెట్టు తీశాడు. రుక్మిణి ఒక్క నిముషం అతని వంక చూసి లోపలికి వెళ్ళింది.

సిగరెట్టు అంటించుకున్నాడతను. అతనికి తెలుసు రుక్మిణి లోపలకు వెళ్ళి ఏం చేస్తోందో. లోపల గిన్నెలు, గరిటెలు, పైపు చప్పుళ్ళవుతున్నాయి. కాని వీటన్నింటికంటే ఎక్కువ వేగంగా విరామం లేకుండా రుక్మిణి మెదడు పని చేస్తోందని తెలుసునతనికి. తన యిప్పటి మాటలను గురించి ఆలోచిస్తుంటుందామె. 'ఈయన చెప్పిన దానిలో కూడా నిజం వుందా?' అని పరిశీలిస్తుంది. కొంచెం వ్యవధి తీసుకుని. నారాయణరావు కళ్ళు సగం మూసుకొని ఆకాశం కేసి, నక్షత్రాల కేసి చూశాడు. అతనికి బాగుంది రుక్మిణి పద్ధతి. తనతో తెల్లారిలేస్తే మెలిగే వారంతా యింత ఆలోచన, ఓపిక కలిగిన వారైతే ఎంత బాగుండును!. తనకి ఎంత పేరు వచ్చును 'మనిషి'గా అనుకున్నాడు.

"మీరు అంటారు కానీండి, నిజంగా ఆడవాళ్ళకున్నంత కష్టం మగవాళ్లకుండదండీ. ఆడవాళ్ళకైతే జీవితాని కంతకీ ఆధారం పరమావధి భర్త మాత్రమే...!" పెద్ద మాటలు వాడగలిగినందుకు ఆశ్చర్యపోతూనే మాట్లాడింది రుక్మిణి... "కానీ మగవాళ్ళకి, ప్రపంచంలోని అనేక వ్యాపకాలలో భార్యతో కాపురం ఒకటి. పద్ధెనిమిది ఏళ్ళ పెండ్లైన పిల్లకి, భర్త ముక్కు మొహం తెలిసినా తెలియకపోయినా అతనే తన జీవిత సర్వస్వం అనుకుంటుంది. కానీ ఇరవై రెండేళ్ళ మగవాడికి అల్లాకాదు. అగ్ని సాక్షిగా పెళ్ళాడిన స్త్రీ తనకు పరాయిదే అనుకుంటాడు. ఆమెను చూడకపోతే...'

అర్థం లేని వాదన చేస్తే అతను నవ్వుతాడు. అల్లాగే నవ్వాడు ఇప్పుడు.

రుక్మిణి కిటికీ దగ్గర నిల్చుని బయటకు చూడసాగింది.

"చూడు రుక్కూ! మీ ఆడవాళ్ళందరికీ తమకే జీవితంలో ప్రేమించే శక్తి ఉన్నదని ఒక గర్వం. ఆత్మార్పణం చేసుకోగలమని ఒక ధీమా. మగవాడు సాగరునిలాగా తనలో తానే హెూరు పెడుతూ, బాధని ఎప్పటికప్పుడు వెనక్కి లాక్కుంటూ వుంటాడు. ఎవరికి తెలుస్తుంది అతని హృదయంలోని బాధ? స్త్రీకి తన భర్తను గురించి ఎన్ని తీయని కలలు, మధురమైన, పవిత్రమైన ఆలోచనలుంటాయో, ముఖం చూడకపోయినా తన భార్య ఐన వ్యక్తిని గురించి పురుషునికీ అన్ని ఆలోచనలుంటాయి.

నిత్య జీవితంలో అతను పాల్గొనవలసిన కార్యక్రమాలు, వ్యాపకాలు ఎక్కువ కాబట్టి, జీవితాన్ని స్తంభీభూతం చేసుకోలేడు పురుషుడు" అన్నాడతను.

"మగవాళ్ళు దినచర్యలో మర్చిపోతారు అన్నీ. వారి హృదయాలకి తీరికుండదు బాధపడ్డానికి" అన్నది రుక్మిణి.

"అంత ఇదిగా తీసి పారేయకు రుక్కూ, ఆడవాళ్ళకి దు:ఖం పొందే సావకాశం ఎక్కువగా వుంటుంది. బాహ్యాలంకరణ విషయంలో మనవాళ్ళు విధించే ఆంక్షలని బట్టి కూడా, వితంతువు జీవితం దుర్భరమైనది గానూ, ఆమె దు:ఖం భయంకరమైనదిగాను కనిపిస్తాయి"

రుక్మిణి అందుకుంది. "అదే నేననేది. స్త్రీకి జీవితంలో ఆ దు:ఖం అన్నిటిని మించి పెను భూతమై, ఆమెను పీల్చి పిప్పిచేస్తుందనీ.. పురుషుడికి ఎన్నటికీ అల్లా కానేరదని..." ఇంక వాదన లేదని చెప్పడానికి సూచనగా ఆమె సావిట్లో దీపం వేసి, అతని చేతికి పత్రిక నందించింది.

ఒక గంట గడిచాక నారాయణరావు లేచి వెళ్ళి, డ్రాయరులోంచి కార్డులు తీసి, మహలక్ష్మమ్మగారికి, తన తల్లికి, సత్యం మామగారికి వుత్తరాలు వ్రాశాడు. అవి పోస్టు చేయడం మర్చిపోకుండా వుండే నిమిత్తం, తను మర్నాడు తొడుక్కోబోయే లాల్చీ జేబులో దాచాడు.

ఆ తరువాత వంటింట్లో పీటవాల్చుకుని రుక్మిణిని చూశాడు. విసుగు లేకుండా ఆమె చేసే పనులను చూస్తూ, ఆమెతో ఏవో కబుర్లు చెప్పాడు. ఆమె వడ్డించే లోపున, వీధిలోకి వచ్చి అల్లుకున్న సన్నజాజి తీగకున్న పూలన్నీ కోశాడు. వెండి గిన్నెలో వాటిని పోసి, దారపు బంతి, సూది తెచ్చి అందులో వుంచాడు. తను పూలు గ్రుచ్చితే కేకలేస్తుంది రుక్మిణి. అందుకని అతను పూలు గ్రుచ్చకుండా, వాసన చూసి, ఆనందంతో, మత్తుతో కళ్ళు మూసుకొన్నాడు. రుక్మిణి కేకేయగానే వెళ్ళి భోజనం చేశాడు.

*

ఉదయం పదకొండు గంటలకి ఏష్ ట్రే ఖాళీ చేసింది రుక్మిణి. కాగితంలో దాన్ని దులిపి, నాలుగు సిగరెట్టు ముక్కలులెక్కపెట్టింది. కాగితంతో సహా చెత్తబుట్టలో పారేసి, సోపుతో చేతులు కడుక్కుంది. సావిట్లోకి వచ్చింది. చుట్టుప్రక్కల యిళ్ళల్లో మనుష్యులున్న అలికిడి కూడా కావడం లేదు. రోజు యింతే. మగవాళ్ళు ఆఫీసులకి వెళ్ళేసరికి, యిల్లా చప్పబడి, నిశ్శబ్దమైపోతాయెందుకో యీ యిళ్ళు అనుకుంది.

నారాయణరావు డ్రాయరు, అలమారు చాలా చెత్తగా వున్నాయని రుక్మిణి కొన్ని రోజులుగా అనుకుంటోంది. డ్రాయరు తీసి క్రిందపడేసి, దులిపింది. అలమారులో పుస్తకాలన్నీ తీసి ఒకొక్కటే దులిపి, అలమారు చీపురుతో ఊడిచి, కొత్త కాగితాలు పరచింది. పుస్తకాలలో మరీ అట్టలు మాసినట్లున్న వాటికి బ్రౌను పేపరు అట్టలు వేసింది. పుస్తకాలన్నీ సర్దింది.

12.30కి మళ్ళీ సోపుతో చేతులు కడుక్కుని పడక్కుర్చీలో వాలింది. ఎదురుగా స్టూలు మీద వున్నది నిన్నటి పోస్టు కార్డు. వంగి, అది తీసుకుని మళ్ళీ చదివింది రుక్మిణి. తను ఎన్నడూ చూడని సత్యం భార్య ఆ పదిహేడేళ్ళ కన్య మెదిలింది మనస్సులో. పాపం... పదో రోజు కాబోలు యివాళ. కార్డు వెనక్కి త్రిప్పి, నారాయణరావు పేరు, చిరునామా చదివింది. 'పోస్టు ముద్ర ఎంత నల్లగా, మొద్దుగా పడిందో.. ఇదే విచారంగా కనిపిస్తుందే' అనుకుందామె.

పోయింది సత్యం కాబట్టి తమదాకా వచ్చింది వార్త. అదేగానీ సత్యం భార్య ఐతే తమకు తెలిసేదే కాదు. నిజం! ఆ అమ్మాయికి యీ దు:ఖం కంటే మరణమే మేలు. కార్డు స్టూలు మీద పడేసి, వెనక్కి వ్రాలింది రుక్మిణి.

సన్నజాజి పందిరివంక చూస్తే ఆమెకు నారాయణరావు జ్ఞాపకం వచ్చాడు. ఆఫీసులో యీ పాటికి ఏం చేస్తుంటారో! ఏం చేస్తేనేం, సాయంకాలం యింటికి వస్తూనే తనని చూసి, అన్నీ మర్చిపోతారు. అమావాస్య రోజుల్లో కూడా చీకటి పడితే గాని, కోయరు సన్నజాజులు. ఎన్ని మార్లో చెబుతాను, పురుగు, పుట్ర వుంటాయని. కానీ వినరు. 'నీకు సన్నజాజులు తప్ప మరొక పువ్వు పనికిరాదు' అంటారు. 'సాయంకాలం కాగానే సన్నజాజులు లేకపోతే నువ్వు శోభించవు' అంటారు ఏమిటో!

రుక్మిణి వళ్ళు విరుచుకుంది. ఆమె కాలు తగిలి స్టూలు, తలక్రిందులై క్రింద పడిపోయింది. వంగి, స్టూలు సరిజేసి, మళ్ళీ ఆ కార్డు తీసుకుంది. 'మరణం చెప్పి వస్తుందా, వయస్సుతో నిమిత్తం వున్నదా? ప్రపంచంలో ఒక మనిషి ఎంత వరకు ఉపయోగం అని గమనించి వస్తుందా మృత్యువు! ఏనాటికెవరో!'

సన్నజాజి పందిరి, నారాయణరావు తన కళ్ళలో మెదలగా రుక్మిణి ముఖం వెలవెలబోయింది యీ ఆలోచనల్లో. తను పోతే? అవును. తను లేకపోతే! యీ ఆలోచన తన మరణాన్ని గురించే కాబట్టి ఛీ ఏమిటీ పాడు ఆలోచన అనిపించటం లేదు రుక్మిణికి.

సాయంకాలం ఆయన వస్తారు యింటికి. సన్నజాజి పందిరి చూస్తుంటే, తనే జ్ఞాపకం వస్తుంది ఆయనకి!

రుక్మిణి లేచి కూర్చుంది. వణికే వ్రేళ్ళతో కార్డు తీసి, నారాయణరావు డ్రాయర్లో పెట్టేసింది.

పుస్తకాలన్నీ దుమ్ముకొట్టుకుని వుంటాయి. సర్దేవాళ్ళేరీ? ఆయనా దుమ్ము పుస్తకాలనే తన అందమైన వేళ్ళతో తీసుకుని, పేజీలు తిరగేస్తారు. ఆ పేజీల మధ్య దేనికోసమో వెతుకుతారు. కాఫీ త్రాగుదురుగాని లేవండి అనరెవ్వరూ.

రుక్మిణి లేచి, కార్డు బైటికి తీసి, చింపేసింది. ముక్కలు చేసి అవతల పారేసింది. దొడ్లో బట్టలు ఆరాయేమో అనుకుంటూ వెళ్ళింది. ఆ అనుకోవడంలోనే మిళితమై, ముసురుకుంటున్నాయి ఆలోచనలు మనస్సులోని ఆలోచనలు రెండు పొరలుగా వున్నాయి. పై పొరలోంచి స్పష్టంగా కనిపిస్తుంది రెండో పొర. తీసి వేద్దామంటే పోని పొర అది.

'దొడ్లోని నీలం చీరె.. ఆ చీరె ఏమౌతుంది. తను లేకపోతే... ఈ చీరెను చూస్తూనే బావురుమనరూ ఆయన? రుక్మిణి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతను మెరుపు తీగలన్న జరీ పోగులు చెదిరాయి ఆమె కళ్ళముందు.

చీరె తెచ్చి లోపల పడేసింది రుక్మిణి. 'వద్దంటుంటే వినక తీయించారు ఆ ఫోటో. తనకసలే ఫోటో అంటే బెరుకు. అలాంటిది ఆయన వెంట వుండి తీసుకు వెళ్ళి, స్టూడియోలో వాళ్ళంతా నవ్వేంత హంగామా చేసి తీయించారు ఆ ఫోటో. ఫోటో తీస్తోంటే, తనకెదురుగా నిలబడి, తన ముఖాన నవ్వు, సిగ్గు మెరిసేటట్లుగా చేశారు. తన కళ్ళలో మెరుపులు, పెదవులపై హాయైన చిరునవ్వు.. జీవితంలోని ఆనందమంతా నాదేనేమో అన్నట్లుంది ఆ ఫోటోలో తను. దానిని ఎన్‌లార్జి చేయించి, టేబిలు మీద పెట్టుకున్నారాయన. టేబిలు మీదవున్న తనని చూసి ఏమైపోతారు? వెర్రివారైపోరూ? ఆ కళ్ళతో మరో స్త్రీని చూడడం సాధ్యమా ఆయనకి" ఆ ఫోటోలో మనిషి తనని రారమ్మని పిలుస్తోందనుకుని, వెర్రి మనిషిలా పరుగులు పెడతారు..."

రుక్మిణి మంచం మీద వ్రాలిపోయింది. ఆమెకి ఆపుకోరాని దు:ఖం వస్తోంది. ఈ గోడలు, తలుపులు, కర్టెన్‌లు అన్నీ నారాయణరావుకి హృదయవిదారకంగా గోచరిస్తాయి. ప్రతి వస్తువు తనని గురించిన స్మృతులు రేపుతూ, ఎడతెరిపిలేని గాయాలు చేస్తుంటుంది మనస్సులో.

దిండులో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది రుక్మిణి. భర్త దీన వదనం, జుట్టు రేగిపోయి, గడ్డం పెరిగిపోయిన అతని ముఖం కనుపిస్తోంది. మూర్తీభవించిన శోకంలా వున్న అతని మూర్తే నిలుస్తోంది. ఎంతో సేపు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయింది రుక్మిణి.

ఆ సాయంకాలం నారాయణరావు రిక్షాలో ఎక్కి, పరుగులు పెట్టె మనస్సుతో యింటికి వచ్చాడు. సన్నజాజి తీగెకి త్రుంచడానికి మొగ్గలు కనిపించక తలుపు తట్టాడు. ఎవరూ తీయకనే తెరుచుకుంది అది . సావిట్లో తన టేబిలు దగ్గర వున్నది రుక్మిణి. ఆమెను చూసి 'అమ్మయ్య' అని నిట్టూర్చాడు నారాయణరావు. ఎఱ్ఱజరీ అంచు తెల్ల చీరె కట్టుకుంది ఆమె. ఆమె తల్లో సిగ్గు సిగ్గుగా నవ్వబోతున్నాయి సన్నజాజులు.

తలుపు చప్పుడికి వెనక్కి తిరిగింది ఆమె. చల్లగా మెల్లగా నవ్వి కాఫీ తెచ్చి యిచ్చింది.

"రుక్కూ, ఈ రోజు యిదేమిటో నాకు అర్థం కావడం లేదు. నా చిన్ననాటి స్నేహితుడు సూర్యనారాయణ అని చెప్పేవాడిని చూడు... అతని భార్య పోయిందిట..." రుక్మిణి మౌనంగా కాఫీ గ్లాసు తీసుకుని లోపలకు వెళ్ళింది. నిన్నటి సంభాషణ మెదిలింది నారాయణరావు మనస్సులో. అల్లాటి రుక్మిణి మనస్సుకి ఏం పడుతుంది యీ విషయం? సూర్యనారాయణని యీ పాటికి పెళ్ళి పీటల మీద వూహించుకుంటుంది ఆమె.

అతను లోపలికి వెళ్ళేసరికి రుక్మిణి కుంపటి విసురుతోంది. "ఆ సూర్యనారాయణని తలుచుకుంటే పాపం గుండె తరుక్కుపోతుందండీ... మగవాళ్ళకేంలే అనుకుంటుంది లోకం... కానీ... పాపం!"

అప్పుడే వర్షించి వెలిసిన ఆకాశంలా, నిర్మలంగా వున్నాయి రుక్మిణి నయనాలు.

"నిజమే!" అనేసి సావిట్లోకి వచ్చేశాడు నారాయణరావు.

రుక్మిణి యీ విషయాన్ని గురించి యిప్పటికిప్పుడే ఆలోచించిందా? లేక ముందే ఆలోచించి పెట్టుకుందా?" అని ఆశ్చర్యపోతూ అతను పడక్కుర్చీలో కూర్చున్నాడు.

❋